రోడ్లపైనే ధాన్యం కుప్పలు



అందాకూర్‌లో రోడ్డుపైనే ఆరబెట్టిన ధాన్యం కుప్పలు

- నిలిచిన కల్లాల నిర్మాణాలు
- ధాన్యం ఆరబెట్టుకునేందుకు రైతులకు తప్పని ఇబ్బందులు

కుంటాల: ఆరుగాలం కష్టించి పండించిన పంటను అమ్ముకునేందుకు రైతులు ఇబ్బంది పడుతున్నారు. యాసంగిలో సాగు చేసిన పంటలు ఇప్పటికే చేతికి రాగా కుంటాల మండలంలోని పీఏసీఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ తేమ లేకుండా ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకురావాలని నిర్వాహకులు సూచిస్తున్నారు. దీంతో పంటను ఆరబెట్టేందుకు కల్లాలు లేక రైతులు రోడ్లను ఆశ్రయిస్తున్నారు.

కల్లాల నిర్మాణం నిలిపివేసిన ప్రభుత్వం

గతంలో ఉపాధిహామీ పథకం కింద కొంతమంది రైతులు కల్లాలు నిర్మించుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం కల్లాలను నిర్మిస్తుందనే కారణంతో జరిమానా విధిస్తూ కొత్త కల్లాల



ఓలా-విఠాపూర్ వెళ్లే దారిలో ఆరబెట్టిన జొన్న

నిర్మాణాలను కేంద్రప్రభుత్వం నిలిపివేసింది. 2021–22ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కుంటాల మండలంలోని 15 గ్రామపంచాయతీల్లో 77 పంట కల్లాలను నిర్మించారు. పెద్ద కల్లానికి రూ.80వేలు, చిన్న కల్లానికి రూ.52వేల నిధులను మంజూరు చేశారు. ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం, ఇతరులకు 90 శాతం నిధులు మంజూరు చేయగా రైతులు కల్లాలను నిర్మించుకున్నారు.

రహదారులే దిక్కు..!

ప్రస్తుతం ప్రభుత్వం పంట కల్లాలకు నిధులు మంజూరు చేయకపోవడంతో రైతులు రోడ్లపైనే ధాన్యాన్ని ఆరబెట్టుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. దీంతో నిత్యం ఏదో ఒకచోట రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ముఖ్యంగా రాత్రి రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. కల్లాలు లేక రోడ్లపైనే ధాన్యాన్ని ఆరబెట్టడంతో అకాల వర్షాలతో నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి కల్లాల నిర్మాణం చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

రోడ్లపైనే ఆరబెడుతున్నాం



యాసంగిలో వరి, మొక్కజొన్న పంటలు సాగు చేశాను. అకాల వర్షాలతో ఇబ్బందులు తప్పడం లేదు. రోడ్లపైనే పంటను ఆరబెడుతున్నాం. కల్లాల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే నిర్మించుకుంటాం.

మొండి గజేందర్, కుంటాల

ఇబ్బంది పడుతున్నాం..



యాసంగిలో సాగు చేసిన పంట ఏటా అకాలవర్షాలకు తడుస్తూనే ఉంది. దీంతో ధాన్యం రంగు మారి దిగుబడులపై ప్రభావం చూపుతుంది. నాలుగు రోజుల కిందట కురిసిన వర్షంతో జొన్న, వరి ధాన్యం తడిసింది. కల్లాలు లేక ఇబ్బందులు పడుతున్నాం.

– ఏలేటి నర్సారెడ్డి, విఠాపూర్

స్కాన్ చేసి.. చదివేయండి

- క్యూఆర్ కోడ్‌లో కథలు, పుస్తకాలు, నవలలు
- పొందుపరిచిన పాఠశాల విద్యాశాఖ
- జిల్లా విద్యార్థులకు సదావకాశం

నిర్మల్‌ఖిల్లా: వేసవి ఉగ్రరూపం దాలుస్తోంది. పిల్లలు బయటకు వెళ్లి మైదానంలో ఆటలు కూడా ఆడలేని పరిస్థితి. ఈ సమయంలో విద్యార్థులు టీవీలు, మొబైల్ ఫోన్లకు అతుక్కుపోతున్నారు. ఈ సమస్యను అధిగమించడంపై పాఠశాల విద్యాశాఖ దృష్టి సారించింది. ఇంటి వద్దనే 'లిటరసీ క్లౌడ్' అనే మాధ్యమం ద్వారా విద్యార్థులకు ఆకర్షణీయమైన, అభిరుచిని పెంపొందించే తెలుగు పుస్తకాలను 'రూమ్ టు రీడ్ ఇండియా ట్రస్ట్' సమన్వయంతో ఆన్‌లైన్‌లో పొందుపరిచింది. వేసవి కాలాన్ని సద్వినియోగం చేసుకునేందుకు ఈ సదావకాశం కల్పిస్తోంది.

అనేక ప్రయోజనాలు..

పిల్లల్లో ప్రాథమిక స్థాయిలో పఠన నైపుణ్యాలు పెంపొందించేందుకు విద్యాశాఖ చక్కని అవకాశం విద్యార్థుల ముందుకు తెచ్చింది. వారిలో చదవడం



స్కాన్ చేయాల్సిన క్యూఆర్ కోడ్ ఇదే..

, రాయడం అలవాటు చేయడం ద్వారా మౌళిక భాష సామర్థ్యాలను పెంపొందించేందుకు దోహదం చేస్తుంది. తద్వారా విద్యార్థుల్లో అభ్యసనసామర్థ్యాలు కూడా పెంపొందుతాయి. కథలు, పుస్తకాలు చదవడం ద్వారా సమయాన్ని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవచ్చు.

ఏం చేయాలంటే..

విద్యార్థులు మొదట లిటరసీ క్లౌడ్ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయాలి. దీంతో నేరుగా సంబంధిత వెబ్‌సైట్‌లోకి తీసుకెళ్తుంది. అక్కడ చిన్నచిన్న నీతి కథలు, పఠన నైపుణ్యాన్ని పెంపొందించే కథలు, నవలలు, సందేశాన్ని అందించే పలు రకాల చిత్రాలు కనిపిస్తాయి. వాటిని మనం డౌన్లోడ్ చేసుకుని చదువొచ్చు. వేసవి సెలవుల కాలంలో విద్యార్థులకు ఈ కథల పుస్తకాలు, నవలలు, చిత్రాల సమాచారం ద్వారా భాషాంశాలపై అవగాహన పెంపొందుతుంది. నైపుణ్యాలు పెరిగేందుకు ఉపయుక్తంగా ఉంటుంది.

పఠన నైపుణ్యాలు పెంపొందించేందుకే..



ఇంటిపట్టున ఉంటున్న విద్యార్థులకు ఈ లింకు చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. పిల్లల్లో విజ్ఞానం, నైపుణ్యం, భాషా సామర్థ్యాలు పెంపొందుతాయి. లిటరసీ క్లౌడ్ ద్వారా పఠనాభిరుచి కూడా పెంపొందుతుంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఈ దిశగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలి.

– డాక్టర్ రవీందర్‌రెడ్డి, డీఈవో

వారసంతలో సౌకర్యాలు కల్పించాలి

ఖానాపూర్: పట్టణంలోని అంగడిబజార్‌లో ప్రతీ ఆది, బుధవారాల్లో నిర్వహించే వారసంతలో సౌకర్యాలు కల్పించాలని కోరుతూ శుక్రవారం ఎంఐఎం నాయకులు మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆసుపత్రికి అంబులెన్స్ వెళ్లేలా చర్యలు చేపట్టడంతోపాటు వారసంతలో మూత్రశాలలు, మరుగుదొడ్లు, తాగునీటి వసతి కల్పించాలన్నారు. వాహనాలను పార్కింగ్ చేసుకునేలా ఏర్పాట్లు చేయాలని కోరారు. పట్టణంలోని ఎనిమిదో వార్డు పరిధి డ్రెయినేజీల్లో పూడిక తీయించి, పారిశుద్ధ్య చర్యలు చేయించాలన్నారు. డబుల్ బెడ్‌రూం కాలనీలోనూ వైద్య శిబిరం



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఏర్పాటు చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో ఎంఐఎం నాయకులు అఖిల్, అప్సర్‌ఖాన్, షారు, తదితరులున్నారు.

ముగిసిన సప్తాహం



పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

భైంసారూరల్: మండలంలోని కుంబి గ్రామంలో విఠలేశ్వర ఆలయంలో వారం రోజులుగా కొనసాగుతున్న సప్తాహం శుక్రవారం ముగిసింది. రోజు భజనలు చేసి కీర్తనలు ఆలపించారు. దీనికి పలువురు గురువులు హాజరై ప్రవచనాలు బోధించారు. దేవుడు.. మనిషికి ఉన్న సంబంధాలు, సమాజంలో మసులుకునే తీరు వివరించారు. అఖండ హరినామ సప్తాహం ముగింపు సందర్భంగా గ్రామంలో మహిళలు మంగళహారతులతో శోభాయాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బోస్లే మోహన్‌రావుపటేల్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సప్తాహంలో కీర్తనలు ఆలపించిన భజన మండళ్ల సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు.

ముస్తాబైన అమ్మవారి ఆలయం



విద్యుత్ కాంతుల నడుమ ఆలయం

- నేడు శ్రీమాత నిమిషాంబ దేవి అవతరణ దినోత్సవం

నిర్మల్‌చైన్‌గేట్: పట్టణంలోని కళానగర్‌లో ఉన్న శ్రీమాత నిమిషాంబదేవి ఆలయంలో శనివారం అవతరణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాంపల్లి శివకుమార్‌వర్మ, రాచర్ల నర్సయ్యవర్మ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అమ్మవారి జయంతి వేడుక సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రత్యేక పూజాది కార్యక్రమాలు, భక్తులకు అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం 5:30 గంటల నుంచి అమ్మవారి విగ్రహాన్ని శోభాయాత్రగా పట్టణంలోని రూరల్ పోలీస్‌స్టేషన్, పాతబస్టాండ్, చింతకుంటవాడ, కస్బా, నగరేశ్వర వాడల మీదుగా అమ్మవారి ఆలయానికి తీసుకెళ్లనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు హాజరు కావాలని కోరారు.

ప్రతి ఒక్కరూ బుద్ధుని మార్గంలో నడవాలి

తానూరు: ప్రతి ఒక్కరూ బుద్ధుని మార్గంలో నడిచి ప్రశాంత జీవనం సాగించాలని పూజ్యభంతే విజయ ప్రియఖేరు అన్నారు. శుక్రవారం మండలంలోని కళ్యాణి గ్రామంలో నూతనంగా నిర్మించిన బుద్ధవిహార్‌ను ప్రారంభించారు. ముందుగా బుద్ధుడి విగ్రహం ఆవిష్కరించి బుద్ధుడి చరిత్ర వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్ సూచించిన 22 ప్రతిజ్ఞలను పాటించాలన్నారు. అంబేద్కర్‌ను స్ఫూర్తిగా తీసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌కే సిర్‌సాగర్, సంజయ్, పాండరంగ్ సిర్‌సాగర్, సుభాష్



పాల్గొన్న బౌద్ధమహాసభ నాయకులు

సిర్‌సాగర్, సందేశ్, నారాయణ్ వాగ్మారే, జీపీ మిసాలే తదితరులు పాల్గొన్నారు.

జంతువుల దాహార్తి తీర్చేలా..

- సాసర్‌పిట్‌ల ఏర్పాటు, ట్యాంకర్లతో నీటి సరఫరా
- సీసీ కెమెరాల్లో పర్యవేక్షిస్తున్న అటవీ అధికారులు



దాహార్తి తీర్చుకునేందుకు వస్తున్న వన్యప్రాణులు

ఖానాపూర్: కవ్వాల్ టైగర్ రిజర్వు పరిధిలోని ఖానాపూర్ రేంజ్‌లో వన్యప్రాణుల సంరక్షణ కోసం అటవీశాఖ అధికారులు చేపట్టిన చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి.

33 సాసర్ ఫీట్ల ఏర్పాట్లు..

ఎండలు పెరుగుతున్నందున ఖానాపూర్ అటవీ రేంజ్ పరిధిలోని గ్రామాల్లో జంతువుల దాహార్తి తీర్చేందుకు అధికారులు 33 సాసర్‌పిట్‌లను ఏర్పాటు చేశారు. ఆయా చోట్ల ఎప్పుడు నీరుండేలా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. మరికొన్ని చోట్ల సోలార్ బోర్లు(పంపుసెట్లు) ఏర్పాటు చేసి నీటిని అందిస్తున్నారు. సాసర్‌పిట్‌లతోపాటు పలు చోట్ల నీటికుంటలు, చెలిమెలను సైతం ఏర్పాటు చేస్తున్నారు. వాగులు, ఒర్రెలు సైతం జంతువుల దాహార్తి తీరుస్తున్నాయి. ఎన్నో జీవజాతులకు నిలయమైన కవ్వాల్ అభయారణ్యంలో పెద్దపులుల తోపాటు చిరుతలు, ఇతర జంతువులు పెరగడంతో అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.



సాసర్‌పిట్‌లో ట్యాంకర్ ద్వారా నీటిని నింపుతున్న వ్యక్తి

సీసీ కెమెరాలతో పర్యవేక్షణ..

సాసర్‌పిట్‌లు, నీటికుంటలు, ఇతర ప్రధాన కూడళ్లలో అధికారులు కెమెరా ట్రాప్‌లను ఏర్పాటు చేశారు. జంతువులు దాహార్తి తీర్చుకునేందుకు రాగానే కెమెరా ట్రాప్‌లలో రికార్డు అవుతున్నాయి. దీంతో అటవీ అధికారులు వాటిని పరిశీలిస్తూ ఎప్పటికప్పుడు జంతువుల సంరక్షణకు అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అనుమతి లేకుండా అటవీ ప్రాంతంలోకి ఎవరూ వెళ్లవద్దని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఖానాపూర్‌తోపాటు సమీప అటవీ ప్రాంతం నుంచి వచ్చిన జంతువులను సైతం సీసీ ఫుటేజీ ద్వారా అధికారులు గుర్తిస్తున్నారు. ఈ సీసీ ఫుటేజీల్లో ఇప్పటికే దుప్పులు, జింకలు, ఎలుగుబంట్లు, నీలుగాయిలు, అడవి బర్రెల తోపాటు చిరుతపులి సైతం నీటిని తాగేందుకు వచ్చినట్లు అధికారులు గుర్తించారు.

వన్యప్రాణుల దాహార్తి తీరుస్తున్నాం

వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని వన్యప్రాణుల సంరక్షణకు పలు చోట్ల గడ్డిక్షేత్రాలు, వాటి దాహార్తి తీర్చేందుకు సాసర్‌పిట్‌లు, నీటికుంటలను ఏర్పాటు చేశాం. ఆయా చోట్ల ఎప్పటికప్పుడు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నాం. వన్యప్రాణుల రాకను దృష్టిలో ఉంచుకుని అనుమతి లేకుండా ఎవరూ అటవీ ప్రాంతంలోకి వెళ్లవద్దు. వన్యప్రాణుల రక్షణలో అందరూ భాగస్వాములవ్వాలి.

– వినాయక్, ఎఫ్ఆర్‌వో, ఖానాపూర్

వాడి గ్రామస్తులకు కష్టాలు

- వంతెన లేక రాకపోకలకు ఇబ్బంది పడుతున్న వైనం
- పట్టించుకోని అధికారులు, పాలకులు



గ్రామస్తులు వెళ్లే దారిలో వాగు

భైంసారూరల్: మండలంలోని కోతల్‌గాం పంచాయతీ పరిధిలోని వాడి గ్రామంలో వంతెన లేక ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. వాడి గ్రామ జనాభా 300. కోతల్‌గాం, వాడి గ్రామాల మధ్య సుద్దవాగు ఉంది. పక్కనే నిర్మించిన పల్సికర్ రంగారావు ప్రాజెక్టు నీటితో ఈ గ్రామానికి ఉండే వంతెన ఆరేళ్ల కిందట కొట్టుకుపోయింది. దీంతో గ్రామస్తులకు ఇబ్బందులు మొదలయ్యాయి. కూలిన వంతెన స్థానంలో మరొకటి నిర్మిస్తామని అధికారులు ఇచ్చిన హామీ ఇప్పటికీ నెరవేరడం లేదు. అధికారులు స్పందించి నూతన వంతెన నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆసుపత్రికి వెళ్లాలన్న తిప్పలే..

వాడి గ్రామస్తులు ఏ చిన్న పని కోసమైనా రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న కోతల్‌గాం వెళ్లాల్సిందే. కానీ వంతెన కూలిపోవడంతో లేక గుండెగాం, మహాగాం, చింతల్‌బోరి మీదుగా 13 కిలోమీటర్లు ప్రయాణించి కోతల్‌గాం వెళ్తున్నారు. ప్రతి నెల ఆసరా పింఛన్లు, రేషన్ సరుకుల కోసం అవస్థలు పడుతూ కోతల్‌గాం వెళ్లి వస్తున్నట్లు గ్రామస్తులు వాపోతున్నారు.

అత్యవసర వేళ ఆసుపత్రికి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు.

వర్షాకాలమంతా ఇబ్బందులే..

ఏటా వర్షాకాలంలో వాడి గ్రామస్తులు ఇబ్బందులు పడుతుంటారు. చిన్నపాటి వర్షం కురిసినా పక్కనే ఉన్న ప్రాజెక్టు నీరు గ్రామంలోకి వచ్చి చేరుతుంది. దీంతో రోడ్లు బురదమయంగా మారుతాయి.



కూలిన పాతవంతెన

వంతెన నిర్మించాలి



వాడి గ్రామ సమీపంలోని సుద్దవాగుపై వంతెన నిర్మించాలి. వంతెన లేక గుండేగాం, చింతల్‌బోరి గ్రామాల మీదుగా మా పంచాయతీ కేంద్రమైన కోతల్‌గాం వెళ్తున్నాం. ఇప్పటికైనా అధికారులు తేరుకుని వంతెన నిర్మాణం చేపట్టాలి.

– సంతోశ్, గ్రామస్తుడు

పొలాలకు వెళ్లలేం



వర్షం కురిస్తే వాగుకు అవతలివైపు ఉన్న పొలాలకు వెళ్లలేం. వర్షం కురిస్తే ఇంటి వద్దే ఉంటున్నాం. వాగుపై వంతెన నిర్మిస్తే రాత్రి కూడా పొలాలకు వెళ్లే వీలుంటుంది. ఈ పరిస్థితి అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదు.

– గంగాధర్, గ్రామస్తుడు

గ్రామంలోకి వచ్చిన నీరు వాగులో కలిసేలా డ్రెయినేజీలు నిర్మిస్తే ఇబ్బందులు ఉండవు.

రైతులకు కష్టమే..

వంతెన లేక పంట పొలాలకు వెళ్లడం కూడా కష్టమవుతుందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. సుద్దవాగుకు అవతల కోతల్‌గాం గ్రామాన్ని ఆనుకుని పంటపొలాలు ఉన్నాయి. వేసవిలో వ్యవసాయ పనులు చేసుకునేందుకు ఏయే ఇబ్బంది లేకపోయినా.. వర్షాకాలంలో మాత్రం ఇబ్బందులు తప్పడం లేదని గ్రామస్తులు పేర్కొన్నారు.

21న అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం

ఖానాపూర్: పట్టణంలోని జేకే నగర్ కాలనీలోని శ్రీలలిత పరమేశ్వరి అయ్యప్ప ఆలయంలో ఈనెల 21 ఆలయ 9వ వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు అడిదెల రాజన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 20న గణపతిపూజ, గౌరిపూజ, స్వస్తి పుణ్యాహవచనం, అఖండ దీపస్థాపన, 21న మూలవిరాట్టుకు పంచామృతాభిషేకాలు, శ్రీలలితా సహస్రనామ కుంకుమార్చన, సుదర్శన చండీయాగం, పూర్ణాహుతి, మహా అన్నదానం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

గుడిసెల తొలగింపు

జన్నారం: జన్నారం అటవీ డివిజన్ తాళ్లపేట రేంజ్ తపాలాపూర్ అటవీ బీట్ లోని కోలాంగూడలో భీమన్న దేవుడి పేరిట వేసిన అక్రమంగా వేసిన గుడిసెలను అటవీ అధికారులు తొలగించారు. ఎఫ్ఆర్వో సుష్మారావు ఉన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నిర్మల్‌చైన్‌గేట్: కురాన్నపేట ఫీడర్ పరిధిలోని 11కేవీలో మరమ్మతుల నేపథ్యంలో పేజ్ త్రీ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ రవి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఖురాన్‌పేట్, గుల్జార్ మార్కెట్, బ్రహ్మపురి, సోమవార్‌పేట్, వెంకటాద్రిపేట, షేక్ సాయిపేట్, కాల్వగడ్డ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని.. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

కొనుగోలు కేంద్రంలోనే విక్రయించాలి



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

నర్సాపూర్(జి): రైతులు కొనుగోలు కేంద్రంలోనే ధాన్యం విక్రయించాలని తహసీల్దార్ సోమ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని రాంపూర్ గ్రామంలో డీఆర్డీఏ ఐకేపీ నిర్మల గ్రామ సంఘం ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్ఐ వేణుగోపాల్, డీపీఎం విజయలక్ష్మి, ఏపీఎం సునంద, సీసీ ముత్యం, బుక్‌కీపర్ కృష్ణవేణి, కమిటీ సభ్యులు లక్ష్మి, గంగామణి పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థులకు సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కుంటాల: మండలంలోని పెంచికల్‌పాడ్ ప్రాథమిక పాఠశాలలో చదివిన పూర్వవిద్యార్థులు ఇటీవల పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించించారు. శుక్రవారం గ్రామస్తులు పాఠశాలలో రుద్ర10 జీపీఏ, సారిక, హారిక, వర్షిణి, ధనశ్రీ, నందకిశోర్ 9.8, పల్లవి 9.7 జీపీఏ సాధించిన పూర్వ విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎల్లన్న, బాబురావు, కిష్టయ్య, రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా పట్టివేత

కడెం: మండలంలోని లింగాపూర్‌లో అదే గ్రామానికి చెందిన గుగ్లావత్ మోహన్ బైక్‌పై 10 లీటర్ల గుడుంబాను తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎక్సైజ్ ఎస్సై అభిషేకర్ తెలిపారు. అనంతరం ఇటీవల గుడుంబా కేసుల్లో పట్టుబడిన ముగ్గురిని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సుజాత ఎదుట బైండోవర్ చేశారు. గుడుంబా తయారీ, రవాణా చేసే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది గౌతమ్, రవీందర్, భాస్కర్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య



ఎక్బాల్‌పూర్‌లో ప్రచారం చేస్తున్న సిబ్బంది

ఖానాపూర్: ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని.. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పట్టణంలోని జూనియర్ కళాశాల సిబ్బంది పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంతోపాటు ఆయా గ్రామాల్లో జూనియర్ కళాశాలలో ప్రవేశం పొందాలని కోసం పదో తరగతి పూర్తి చేసిన వారి ఇళ్లకు వెళ్లి ప్రచారం చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలకు దీటుగా బోధనతోపాటు ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందజేస్తామని అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకుడు సంతోష్ రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం



పూర్వవిద్యార్థులతో ఉపాధ్యాయులు

లక్ష్మణచాంద: మండలంలోని చామన్‌పెల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2003–04లో ఏడో తరగతి చదివిన విద్యార్థులు శుక్రవారం కలుసుకొని నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు బోధించిన గురువులను సత్కరించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.